ఉపాధిలో కొత్త పనులు!

- ఉపాధి పనుల్లో న్యూ స్ట్రాటజీ వర్క్స్‌పై ఆసక్తి
- తోటల్లో కందకాలు, కుంటలు తవ్వేందుకు ప్రాధాన్యం
- గ్రామసభల్లో రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణ
- నియోజకవర్గంలో 350కి పైగా పనులు


పెనుబాక మామిడితోటలో నీటికుంటలు తవ్వుతున్న వేతనదారులు

రాజాం: ఉపాధి హామీ పథకంలో న్యూ స్ట్రాటజీ వర్క్స్(పనులు)పై రైతులు ఎక్కువగా ఆసక్తి కనబరుస్తున్నారు. వేసవి ఆరంభం కావడంతో గ్రామీణ ప్రాంతాల్లో పనులకు బాగా డిమాండ్ పెరిగింది. గ్రామస్తులకు, భవిష్యత్‌లో రైతులకు ఉపయోగపడే పనులపై డ్వామా శాఖ దృష్టి సారించింది. అటు రైతులు, ఇటు వేతనదారులు దీర్ఘకాలంగా లబ్ధి పొందడం, అన్ని ప్రాంతాల్లో పచ్చదనానికి ప్రాధాన్యమివ్వడం, పనుల ద్వారా పెంచిన పండ్ల తోటలతో రైతులకు శాశ్వత ఫలసాయం అందివ్వడం వంటి పనులు చేయిస్తోంది.

పచ్చదనమే ప్రధానం..

గతేడాది నుంచే ఉపాధి పనుల్లో న్యూ స్ట్రాటజీ వర్క్స్ ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా రైతులు తమ పొలాల్లో పండ్ల తోటలు పెంచుకునేందుకు ఉపాధి పథకం ద్వారా ప్రోత్సాహకం అందిస్తున్నారు. పచ్చదనం ప్రధానాంశంగా ఉపాధి పథకం ద్వారా రైతులు తమ పొలాల చుట్టూ కందకాలు(ట్రెంచ్‌లు) తవ్వుకునేందుకు, పొలాలు గట్లు, పొలాల్లోని చెట్లు, మొక్కల చుట్టూ ట్రెంచ్‌ల ఏర్పాటుకు రైతులకు నిధులు చెల్లించడం జరుగుతోంది. ఒక్కోచోట ఈ పనుల ద్వారా రైతులకు పొలాల వద్ద చెట్లు సంరక్షించుకునే అవకాశం లభించడంతో పాటు రూ.17 వేల వరకు సాయం లభించనుంది. మరోవైపు ఈ కందకాల ద్వారా చెట్టుకు నీటి సదుపాయం లభిస్తుంది. పొలాల్లో నీటి కాలువలు ఏర్పడతాయి. ఒక పొలం నుంచి ఇంకో పొలానికి చీడపీడలు వెళ్లని పరిస్థితి వస్తుంది. ఎకరా నుంచి


సంకిలి వద్ద జీడితోటలో కందకాల తవ్వకాలు

మూడెకరాల వరకు పంటపొలాలున్న రైతులు తమ మెట్టు ప్రాంత పొలాల్లో నీటి కుంటలు తవ్వుకునేందుకు నిధులు కేటాయిస్తున్నారు. 9 మీటర్ల వెడల్పు, 9 మీటర్ల పొడవుతో పాటు రెండు మీటర్ల లోతు మేర వీటిని తవ్వుకోవాలని, నిర్మాణాలకు ఆయా రైతులకు రూ.50 వేల వరకు నిధులు వెచ్చిస్తామని అధికారులు చెబుతున్నారు.

చకచకా పనులు..

న్యూ స్ట్రాటజీ వర్క్స్ కోసం గ్రామీణ ప్రాంతాల్లో రైతుల దగ్గర నుంచి ఫీల్డ్ అసిస్టెంట్లు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. రాజాం నియోజకవర్గంలోని రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల నుంచి మొత్తం 250కి పైగా దరఖాస్తులు ఇప్పటివరకు వచ్చినట్లు ఏపీవో సాయిరాం తెలిపారు. ఇప్పటికే పలుచోట్ల పనులు కూడా చకచకా జరిగిపోతున్నాయని పేర్కొన్నారు.

ఏడాదికి రూ.17 వేల సాయం..

ఉపాధి పథకం ద్వారా మంజూరు చేస్తున్న నిధులతో రైతులు కందకాలు తవ్వుకుంటున్నారు. దీని ద్వారా అటు రైతులకు, ఇటు వేతనదారులకు ఉపయోగం. వేతనదారులకు పని కల్పించడం ద్వారా వేతనం, రైతులకు కందకాల తవ్వకాలకు సాయంగా ఏడాదికి రూ.17 మేర సాయం పొందవచ్చు. తోటలను కూడా బాగుచేసుకోవచ్చు.

–కె.సాయిరాం, ఏపీవో, రాజాం

తోటలు బాగు చేసుకుంటున్నాం..

ఉపాధి హామీ పథకం పనుల ద్వారా జీడిమామిడి తోటలను బాగు చేసుకుంటున్నాం. తోటల్లో కందకాలు, నీటికుంటలు తవ్వాం. వేసవిలో పూర్తిగా పని దొరకడంతో పాటు తోటలు కూడా బాగుంటున్నాయి. ఈ పథకం చాలా ఉపయోగపడుతోంది.

కె.వెంకటరమణ, రైతు, సంకిలి

అగ్నిఅస్త్రంతో కత్తెరపురుగు నివారణ


రాజాం సిటీ: అగ్నిఅస్త్రం తయారీ విధానాన్ని వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రాజాం సిటీ: అగ్నిఅస్త్రం ద్రావణంతో పంటలను పట్టి పీడిస్తున్న కత్తెరపురుగును నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది బి.రమాదేవి తెలిపారు. మండలంలోని జీసీహెచ్ పల్లి, బీఎస్‌వలస గ్రామాల్లోని రైతులకు అగ్నిఅస్త్రం తయారీపై శనివారం అవగాహన కల్పించారు. 3 కిలోల వేపాకు, కిలో పచ్చిమిర్చి, అరకిలో వెల్లుల్లి, కిలో పొగాకు కాడలు, జిల్లేడు ఆకులు, 20 లీటర్ల ఆవుమూత్రం కలిపి ఓ పాత్రలో వేయాలని దానిని మూడు పొంగులు వచ్చినంత వరకు మరగబెట్టాలని తెలిపారు. ఆ మిశ్రమాన్ని చల్లార్చిన తర్వాత వడకట్టి ఎకరానికి 5 లీటర్ల పిచికారీ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీ ఎస్.భానుమతి, కె.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో భీష్మ ఏకాదశి పూజలు


రాజాం: పార్వతీపరమేశ్వరుల కల్యాణోత్సవం


అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న గాదం కుటుంబీకులు

తెర్లాం: మండలంలోని అప్పలంపేట, బూరిపేట తదితర గ్రామాల్లో భీష్మ ఏకాదశి పూజలు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అప్పలంపేటలో రాముల వారి చెట్టుకు భక్తులు విశేష పూజలు చేశారు.

రేగిడి: భీష్మ ఏకాదశి పూజల్లో భాగంగా మండలంలోని తాటిపాడు గ్రామంలో గాదం కుటుంబీకులు, గ్రామస్తులు కలిసి బాలఅన్నమ్మ పేరంటాలుకు ప్రత్యేక పూజలు చేయడంతో పాటు బోనాలు సమర్పించారు. ఆలయ ధర్మకర్త గాదం గోవిందరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ పేట్ట బాబూరావునాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాజాం: భీష్మ ఏకాదశి సందర్భంగా స్థానిక పట్టణంలోని మల్లిఖార్జునకాలనీలో ఉన్న కల్యాణగౌరీమల్లిఖార్జునస్వామి ఆలయంలో పార్వతీపరమేశ్వరుల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు.

క్షయవ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి


అవగాహన కల్పిస్తున్న అధికారులు

వంగర: క్షయవ్యాధి నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని జిల్లా క్షయవ్యాధి నిర్మూలన సంస్థ అధికారులు పీవీజీ కృష్ణారావు, చోడవరపు అంజలి కోరారు. మండలంలోని వీవీఆర్‌పేటలో క్షయ వ్యాధి నిర్మూలనపై శనివారం అవగాహన కల్పించారు. వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలను సదరు అధికారులు ప్రజలకు వివరించారు.

రెండు పూటలా పనులు చేయాలి


తెర్లాం: గోపాలవలసలో ఉపాధి పనులు

తెర్లాం/బొబ్బిలిరూరల్/రేగిడి: మండలాల్లోని పలు గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులు జరుగుతున్నాయి. ఆ పనులను ఏపీవోలు శనివారం పరిశీలించి, పలు సూచనలు చేశారు. నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు రూ.300 వేతనం గిట్టుబాటు అవుతుందన్నారు. రెండు పూటలా చల్లగా ఉన్న సమయంలో పనులు చేసుకోవాలని, పని ప్రదేశంలో తాగునీరు, టెంట్లు, ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

క్లుప్తంగా

ఆయకట్టు పనులు పూర్తి చేయండి


కాలువ పనులను పరిశీలిస్తున్న ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు కృష్ణమూర్తినాయుడు

బొబ్బిలిరూరల్: వెంగళరాయసాగర్ ప్రాజెక్టు అదనపు ఆయకట్టు పనులు పూర్తి చేసి రైతులకు సాగునీరు అందివ్వాలని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు మరిశర్ల కృష్ణమూర్తినాయుడు కోరారు. మండలంలోని వాకాడవలస గ్రామ సమీపంలో ఆయకట్టు కాలువ పనులను ఆయన శనివారం పరిశీలించారు. ఆయకట్టు పనులు ప్రారంభమై పుష్కర కాలం పూర్తయినా పనులు పూర్తి కాలేదన్నారు. కాలువలను సగం వరకు తవ్వి వదిలేయడంతో వర్షపునీరు చెరువుల్లోకి చేరడం లేదన్నారు.

ఆయుర్వేదంతో దీర్ఘకాలిక వ్యాధులు నయం


ఆయుర్వేద మందులు అందుకున్న వారితో వైద్యాధికారి సునీల్‌కుమార్

రేగిడి: ఆయుర్వేద వైద్యంతో దీర్ఘకాలిక వ్యాధులు నయమవుతాయని ఆయుర్వేద వైద్యుడు ఎస్.సునీల్‌కుమార్ అన్నారు. మండలంలోని ఖండ్యాం, ఉప్పర్నాయుడువలస, చాటాయివలస గ్రామాల్లో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి హాజరైన రోగులకు ఆరోగ్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కీళ్ల నొప్పులు, వాతనొప్పులు, రక్తపోటు, మధుమేహం, చర్మవ్యాధులకు ఆయుర్వేదంలో మంచి మందులు ఉన్నాయన్నారు. ఆయుర్వేదాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి


సీసీ రోడ్డు నిర్మిస్తున్న దృశ్యం

రాజాం: మండలంలోని గడిముడిదాం గ్రామంలో రూ.10 లక్షల అంచనా వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణాలను ఎంపీడీవో వి.శ్రీనివాసరావు శనివారం పరిశీలించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు


చిన్నారులకు టీకాలు వేస్తున్న ఏఎన్‌ఎం ప్రశాంతి

తెర్లాం: స్థానిక అంగన్‌వాడీ కేంద్రం–5లో చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు శనివారం వేశారు. తెర్లాం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ దివ్యభారతి మాట్లాడుతూ చిన్నారులకు క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయాలని సూచించారు. టీకాలపై ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలంతా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త వై.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

రాజాం: స్థానిక అమృత హాస్పిటల్‌కు వచ్చిన రేగిడి మండలంలోని వావిలవలస గ్రామానికి చెందిన పలువురు నిరుపేదలకు ఆస్పత్రి యాజమాన్యం శనివారం అన్నదానం చేశారు. అంతకుముందు ఆస్పత్రి ఎండీ డాక్టర్ రవిప్రసాద్ వారికి ఆరోగ్య తనిఖీలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు.

ఇష్టారాజ్యంగా గ్రావెల్ తవ్వకాలు

బొబ్బిలిరూరల్: మండలంలోని పిరిడి గ్రామంలో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేపడుతున్నారు. గ్రామంలో ఉపాధి హామీ పథకం నిధులతో చేపడుతున్న రోడ్డు నిర్మాణానికి వందలాది మెట్రిక్ టన్నుల గ్రావెల్ అవసరం కాగా, ఎటువంటి అనుమతులు లేకుండా ఆ గ్రామ సమీపంలో గ్రావెల్ తవ్వకాలు ఇష్టారాజ్యంగా చేస్తున్నారు. శని, ఆదివారాల్లో ఈ పనులు ఎక్కువగా చేపడుతుండగా, శనివారం ఉదయం జేసీబీతో తవ్వకాలు చేసి 10 ట్రాక్టర్ల లోడు గ్రావెల్‌ను తరలించారు. ఈ విషయం అధికారులకు తెలిసినా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

బొబ్బిలి ప్రీమియర్ లీగ్–2 ప్రారంభం

బొబ్బిలి: స్థానిక సంస్థానం ఉన్నత పాఠశాల మైదానంలో బొబ్బిలి ప్రీమియర్ లీగ్–2 క్రికెట్ పోటీలు అట్టహాసంగా శనివారం ఆరంభమయ్యాయి. ఎమ్మెల్యే బేబీనాయన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై, బ్యాటింగ్ చేసి పోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో పాలూరు గణేష్, పప్పల రమేష్, బొత్స సందీప్, అభ్యుదయ విద్యాసంస్థల ప్రిన్సిపాల్ డాక్టర్ చింత శారద తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

రేగిడి: మండలంలోని సోమరాజుపేట, అంబఖండి గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయంపై శనివారం అవగాహన కల్పించారు. ప్రకృతి సేద్యం ద్వారా ఆరోగ్యాన్నిచ్చే నాణ్యమైన ఉత్పత్తులు, అధిక దిగుబడులు వస్తాయని ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జ్ నాగరాజు తెలిపారు. రైతులంతా ప్రకృతి వ్యవసాయానికి మరలాలన్నారు. అనంతరం వరి సాగులో దోమ నివారణకు పత్రద్రావణం, తూటికకు కషాయం తయారీని వివరించారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీలు లక్షుంనాయుడు, వరలక్ష్మి, రవి తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని బూరాడ, తోకలవలస, లక్ష్మణవలస తదితర గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న మొక్కజొన్న పంటను ఏవో మురళీకృష్ణ శనివారం పరిశీలించి, పంటలో తెగుళ్ల నివారణకు, అధిక దిగుబడులకు పలు సూచనలు చేశారు.

మాజీ సర్పంచ్ మృతి


తలచింతల పైడియ్య(ఫైల్)

రాజాం సిటీ: రాజాం మేజర్ పంచాయతీ మాజీ సర్పంచ్, విశ్రాంత ఉపాధ్యాయుడు తలచింతల పైడియ్య(85) శనివారం మృతి చెందారు. ఈయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ రాజాంలోని ఆయన స్వగృహం వద్దనే రాత్రి మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఉపాధ్యాయుడిగా పదవీ విరమణ పొందిన ఈయన 2001 నుంచి 2005 వరకు సర్పంచ్‌గా పని చేశారు. ఈయన పదవీకాలం పూర్తికాక ముందే రాజాం నగరపంచాయతీగా ఏర్పడడంతో ఈయనే రాజాం..కు ఆఖరు సర్పంచ్‌గా రికార్డుల్లో నిలిచారు. ఆయన మృతి పట్ల పలువురు పట్టణ ప్రముఖులు సంతాపం ప్రకటించారు.

అట్టహాసంగా దేవుడుబాబు జాతర

రామభద్రపురం: మండలంలోని కొండకెంగువ గ్రామంలో దేవుడుబాబు జాతర శనివారం అట్టహాసంగా జరిగింది. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు దేవుడుబాబును దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. పండగలో భాగంగా విజయనగరం జానకీరామ్ బృందం చేసిన రేలా రే రేలా నృత్య ప్రదర్శనతో పాటు బిందెల డ్యాన్స్, తప్పెటగుళ్లు, కోలాటం ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

ఆస్పత్రి అభివృద్ధి సలహా కమిటీ నియామకం

బాడంగి: స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి అభివృద్ధి సలహా కమిటీ నియామకం శనివారం జరిగినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ పి.నాగేశ్వరరావు తెలిపారు. చైర్మన్‌గా ఎమ్మెల్యే బేబీనాయన, గౌరవ సభ్యుడిగా ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, కన్వీనర్‌గా డాక్టర్ పి.నాగేశ్వరరావు, సభ్యులుగా ఎంపీడీవో ఎస్.రామకృష్ణ, మహిళా మండలి సమాఖ్య అధ్యక్షురాలు యామల భారతి, పంచాయతీ కార్యదర్శి మరడాన ధనంజయనాయుడు, సామాజిక కార్యకర్త లగుడు సత్యం, మద్రాపు యుగంధర్‌లు నియమితులయ్యారు.

వైద్యం.. దయనీయం!



బాడంగి సీహెచ్‌సీ(సామాజిక ఆరోగ్య కేంద్రం)లో వైద్యం దయనీయంగా మారింది. సరైన వైద్యం.. సకాలంలో అందడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇక్కడ నెలకొన్న వసతి సమస్య.. అటు వైద్య సిబ్బందిని, ఇటు రోగులను తీవ్రంగా వేధిస్తోంది. ముఖ్యంగా చికిత్స పొందేందుకు ఆస్పత్రిలో చేరే రోగులకు సరిపడ బెడ్లు(మంచాలు) లేక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. హాస్పిటల్ వరండాలోనే బెడ్లు వేసి రోగులకు వైద్యం అందిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. దీనికితోడు ఒకే మంచంపై ఇద్దరు రోగులకు చికిత్స అందిస్తున్నారు. వైద్య సిబ్బంది కొరత కారణంగా వైద్యసేవలకు గంటల తరబడి చూడాల్సిన దుస్థితి. 30 నుంచి 50 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ అయినా వసతులు మెరుగవ్వలేదని రోగులు వాపోతున్నారు. నాబార్డు నిధులతో నిర్మిస్తున్న కొత్త భవనాలు ఇంకా నిర్మాణ దశలోనే ఉన్నాయని, మరో రెండు నెలల్లో వాటిని వినియోగంలోకి తీసుకువస్తామని ఆస్పత్రి ఇన్‌చార్జ్ డాక్టర్ నాగేశ్వరరావు తెలిపారు.

–బాడంగి

ధాన్యం కొనుగోలు చేయాలని వినతి



ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. తెర్లాం మండలంలోని నందిగాం, తెర్లాం, ఆమిటి, కొరటాం తదితర గ్రామాల రైతులంతా తహసీల్దారు జి.హేమంత్‌కుమార్‌ను మండల కేంద్రంలో శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. తుపాను వర్షాల కారణంగా ఖరీఫ్ సీజన్‌లో పండించిన వరి.. నూర్పిడి పనులు సకాలంలో చేయలేకపోయామన్నారు. తమ వద్ద ప్రస్తుతం 2 వేల టన్నుల ధాన్యం ఉందని అయితే లక్ష్యం పూర్తయిందని ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లను నిలిపి వేసిందన్నారు. ధాన్యం విక్రయానికి అనుమతులు ఇచ్చి, ఆదుకోవాలని వేడుకున్నారు. స్పందించిన తహసీల్దారు.. సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్తానన్నారు.

–తెర్లాం

సీఎం.. క్షమాపణలు చెప్పాల్సిందే..



గిరిజన మహిళలపై ఒడిశా ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మఝి చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ ఐద్వా(అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం) నేతలు శనివారం ఆందోళనకు దిగారు. రామభద్రపురంలోని సంతతోట వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఆ సంఘ జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ మాట్లాడుతూ గిరిజన మహిళలు అందంగా ఉండరని, అందుకే తాను వివాహం చేసుకోలేదన్న ఆయన మాటలు ఆడవాళ్లను కించపరిచేలా ఉన్నాయన్నారు. రక్షణ కల్పించాల్సిన ముఖ్యమంత్రే ఇలా మాట్లాడడం చాలా సిగ్గుచేటన్నారు. మహిళల మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరించిన సీఎం.. క్షమాపణలు చెప్పి తీరాల్సిందేనని లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

–రామభద్రపురం

ఘనంగా ఆలయ ప్రారంభోత్సవం


బొబ్బిలి: శేషప్రభ వాహనంపై ఊరేగుతున్న రుక్మిణీ సమేత వేణుగోపాలస్వామి


సంతకవిటి: స్వామి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

సంతకవిటి: మండలంలోని సిరిపురంలో కొత్తగా నిర్మించిన శ్రీసిరి కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రారంభోత్సవం శనివారం ఘనంగా జరిగింది. వేదపండితులు భానుదేవపురపు సూర్యప్రకాష్ శర్మ ఆధ్వర్యంలో సర్వదేవతా హవనం, స్వామి వారి మూలమంత్ర హవనం, యంత్ర, విగ్రహ, శిఖర, ధ్వజస్తంభ, స్థిర ప్రతిష్ఠ, మహాపూర్ణాహుతి, ప్రాణ ప్రతిష్ఠ, అవబృద స్నానం, స్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొని, స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహన్‌రావు స్వామి వారిని దర్శించుకుని, విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ డోల తిరుపతి, ఆలయ ధర్మకర్త కర్రి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని తారకరామా కాలనీలో మహాగణపతి, సుబ్రహ్మణ్యస్వామి, కోదండ రామాలయ ప్రారంభోత్సవాలు, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం శనివారం అట్టహాసంగా జరిగాయి. మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు కార్యక్రమానికి హాజరై, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ శంబంగి లక్ష్మీవేణుగోపాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: పట్టణంలోని పురాతన రుక్మిణీ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాంతర్గత ఉత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. ఉదయం ఆలయంలోని ఉత్సవమూర్తులను శేషప్రభ వాహనంపై ఊరేగించారు.